# సినిమా న్యూస్



## 'మెగా ప్రిన్సెస్ క్లింకారా' ఫేస్ రివీల్ చేసిన ఉపాసన

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన కొణిదెల గారాల పట్టి 'క్లింకారా కొణిదెల' మూడో పుట్టినరోజు వేడుకలు జూన్ 20 ఘనంగా జరిగాయి. ఈ ప్రత్యేకమైన రోజున మెగా అభిమానులకు చెర్రీ దంపతులు ఒక అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చారు. గత మూడేళ్లుగా ఎంతో రహస్యంగా ఉంచుతూ వచ్చిన తమ ముద్దుల కూతురు ముఖాన్ని తొలిసారిగా ప్రపంచానికి పరిచయం చేశారు. క్లింకారా బర్త్ డే సందర్భంగా ఉపాసన కొణిదెల తన అఫీషియల్ సోషల్ మీడియా వేదికగా ఒక అద్భుతమైన ఫ్యామిలీ ఫోటోను పంచుకున్నారు. ఈ ఫోటోలో రామ్ చరణ్, ఉపాసనలతో పాటు క్లింకారా చాలా క్యూట్‌గా కనిపిస్తోంది. "మా లిటిల్ ప్రిన్సెస్‌కు హ్యాపీ బర్త్ డే" అంటూ ఉపాసన శుభాకాంక్షలు తెలిపారు.

పండగ చేసుకుంటున్న మెగా అభిమానులు..

ఇప్పటివరకు చిరంజీవి, పవన్ కల్యాణ్ వంటి మెగా హీరోలు క్లింకారాతో దిగిన ఫోటోలు బయటకు వచ్చినప్పటికీ.. ఎక్కడా కూడా పాప ఫేస్ కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. అయితే నేడు నేరుగా ఫేస్ రివీల్ చేస్తూ ఫోటోస్ షేర్ చేయడంతో మెగా ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. "అచ్చం అమ్మ(ఉపాసన)లాగే ఉంది" అంటూ నెటిజన్లు, అభిమానులు క్లింకారా ఫోటోను రీ-ట్వీట్లు చేస్తూ ట్రెండ్ చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా 'మెగా ప్రిన్సెస్' క్లింకారాకు పెద్ద ఎత్తునే బర్త్ డే విషెస్ వెల్లువెత్తుతున్నాయి.

## సస్పెన్సింగ్‌గా 'నాగబంధం' ట్రైలర్

వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే అభిషేక్ పిక్చర్స్ బ్యానర్ నుండి వస్తున్న మరో భారీ బడ్జెట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'నాగబంధం'. యువ నటుడు విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న ఈ మూవీ నుంచి తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ట్రైలర్‌ను చూస్తే.. అనంత పద్మనాభ స్వామి దేవాలయంలోని స్వర్ణపుష్పం దక్కించుకునేందుకు కొందరు విలన్స్ ప్రయత్నిస్తుంటారు. ఈ ప్రయాణంలో హీరో వాళ్లకు సహాయపడాల్సి వస్తుంది. తర్వాత ఏమైంది? అసలు హిమాలయాల్లో ఉండే నాగసాధువులు ఎందుకు వచ్చారు? లాంటి అంశాలను చాలా సస్పెన్స్‌గా కట్ చేసి సినిమాపై క్యూరియాసిటీ పెంచేశారు మేకర్స్. యాక్షన్, రక్తపాతం, ప్రతి ఫ్రేమ్‌లో గంభీరం ఇవన్ని సినిమాను నెక్స్ట్ లెవల్‌లో ప్రజెంట్ చేస్తున్నాయి. నభా నటేశ్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ భారీ అంచనాల మధ్య జులై 3న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది. కాగా.. మైథలాజికల్ టచ్‌తో కూడిన అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. పురాతన దేవాలయాల్లోని రహస్యాలు, వాటిని కాపాడే శక్తుల నేపథ్యంలో సాగే ఈ మిస్టరీ డ్రామా ప్రేక్షకులను కొత్త లోకంలోకి తీసుకెళ్లనుందట. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్లు మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి.




## సడెన్ సర్‌ప్రైజ్ ఇచ్చిన ప్రభాస్..!



లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాస్ దర్శకత్వంలో, దర్శకుడు నాగ్ అశ్విన్ నిర్మాణంలో వచ్చిన లేటెస్ట్ కల్ట్ క్లాసిక్ మూవీ 'సింగ్ గీతం'. జూన్ 12న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా విమర్శకుల నుండి భారీ ప్రశంసలు అందుకుంటోంది. సాధారణ ప్రేక్షకులతో పాటు సినీ సెలబ్రిటీలు సైతం ఈ సినిమా మేకింగ్‌కు ఫిదా అయిపోతున్నారు. అయితే, ఒక ప్యూర్ కల్ట్ క్లాసిక్‌గా ప్రశంసలు దక్కించుకుంటున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల పరంగా మాత్రం లాభాలను రాబట్టలేకపోతోంది. ఇలాంటి విచిత్రమైన పరిస్థితిలో ఈ సినిమాకు మద్దతుగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ రంగంలోకి దిగారు. మూవీ ప్రమోషన్స్ పెంచి కలెక్షన్లు రాబట్టేందుకు నాగ్ అశ్విన్‌తో కలిసి ప్రభాస్ ఒక ప్రత్యేకమైన 5 నిమిషాల వీడియోలో సందడి చేశారు.

ఎంతో ఫన్నీగా సాగిన ఈ వీడియో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఇందులో మొదట నాగ్ అశ్విన్ 'సింగ్ గీతం' సినిమా గురించి అడగ్గా, ప్రభాస్ ఏం చెప్పాలా అని కాస్త కంగారు పడతాడు. ఆ తర్వాత అప్పటికప్పుడు సినిమా చూసేసి నేరుగా నాగ్ అశ్విన్‌కే ఫోన్ చేస్తాడు. "అసలు ఇంత మంచి సినిమాలో నన్ను ఎందుకు తీసుకోలేదు?" అంటూ ప్రభాస్ చాలా సీరియస్‌గా నాగ్ అశ్విన్‌ను ప్రశ్నించడం వీడియోలో హైలైట్‌గా నిలిచింది. ఆ తర్వాత ఇద్దరూ కలిసి సినిమాలోని విశేషాలను సరదాగా పంచుకున్నారు. ఇంతటి అద్భుతమైన చిత్రాన్ని ప్రతి ఒక్కరూ థియేటర్లలోనే చూసి ఆదరించాలని ప్రభాస్ ప్రేక్షకులను కోరారు. డార్లింగ్ ప్రభాస్ ఇచ్చిన ఈ సడెన్ సర్‌ప్రైజ్ ప్రమోషనల్ వీడియోతో అటు ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు.




## ఆర్య రీ-రిలీజ్ డేట్ వచ్చేసింది

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, అనురాధ మెహతా హీరోయిన్‌గా, దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన 'ఆర్య' చిత్రం 2004లో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని దిల్ రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించారు. గత కొంతకాలంగా 'ఆర్య' చిత్రాన్ని రీ-రిలీజ్ చేయనున్నట్లు వార్తలు వస్తుండగా, తాజాగా మేకర్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, హిందీ, మలయాళం భాషలో రీ-రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు.

ఈ విషయంపై సోషల్ మీడియాలో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అల్లు అర్జున్ నటించిన 'హ్యాపీ' చిత్రాన్ని కేరళలో రీ-రిలీజ్ చేయగా అక్కడ ఆ సినిమా విశేష స్పందనను సొంతం చేసుకుని రికార్డు స్థాయి వసూళ్లు సాధించింది. దీంతో ఇప్పుడు 'ఆర్య' కూడా రీ-రిలీజ్‌లో భారీ కలెక్షన్లు సాధించి కొత్త రికార్డులు నెలకొల్పుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ కల్ట్ క్లాసిక్ మూవీ రీ-రిలీజ్‌లో ఎలాంటి ప్రభావం చూపిస్తుందో, బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి వసూళ్లు రాబడుతుందో చూడాలి.